


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 99-

# ఎడారి ప్రేమలు

రాత్రి చిక్కబడింది.

కువైట్ పట్టణంలోని పరిసరాలన్నీ సద్దుమణిగాయి.

సిటీ మధ్యలో వున్న అలియా అపార్ట్ మెంట్ లో లైట్లన్నీ ఒక్కొక్కటిగా ఆరిపోయాయి.

తలుపు శబ్దం అయితే లేవచ్చు అనుకుంటూ బయట కేబిన్ లో కూర్చున్న సెక్యూరిటీ గార్డ్ నిద్రలోకి జారుకున్నాడు.

ఆ బిల్డింగ్ చుట్టూ అమర్చిన కెమెరాలు మాత్రం నిశ్శబ్దంగా తమ పని చేసుకుపోతున్నాయి.

నాలుగో ఫ్లోర్ లో రూం 405 నుండి మెల్లగా బయటకొచ్చింది జూలీ. లిఫ్ట్ ఉపయోగించకుండా, కెమెరా కంట పడకుండా మెట్లు దిగుతూ మొదటి అంతస్తుకు చేరుకుని ముని వేళ్ళతో 106 తలుపును తట్టింది.

అలా చాటుగా రావడం అలవాటే ఆమెకు. ఆ తలుపు ఆమెకు స్వర్గ ద్వారం. ఆ వెనక వున్నది రసరమ్య లోకం.

చిన్నగా నిట్టూర్చింది.

ఆమె కోసమే ఎదురు చూస్తున్నట్లుగా గబుక్కున తలుపు తెరిచాడు విక్రం. మాటలేవీ లేవు. చిన్న నవ్వు నవ్వింది. మనసును మెస్మరైజ్ చేసే నవ్వు. గంటసేపు ప్రేమను పంచుకున్నారు. సుఖంలో ఓల లాడారు. ఒకరినొకరు కళ్ళనిండా చూసుకున్నారు.

"మీ నాన్నకు ఆరోగ్యం కుదుట పడగానే వచ్చేస్తావు కదూ" బేలగా అడిగాడు విక్రం ఒక కవర్ ను చేతికి అందిస్తూ.

"నేను మాత్రం నిన్ను చూడకుండా వుండగలనా విక్రం. నాన్నకు ఆపరేషన్ అవగానే తిరిగి వచ్చేస్తాను."

ఆఖరుసారిగా కరచాలనం చేసి చేతిని ముద్దు పెట్టుకున్నాడు.

జూలీ కొన్ని రోజులు కనబడదు అనుకుంటేనే కన్నీళ్ళు పొంగుకొచ్చాయి. కనబడనీయలేదు. రెప్పల మాటున అణచుకున్నాడు.

ప్రాణంతో సమంగా ప్రేమించిన ప్రియురాలు. ఒక్కరోజు ఆమెను చూడకపోతే వుండలేని స్థితి విక్రంది. మగవాడు నిజంగా హృదయంతో ప్రేమించడం తక్కువ. కానీ ఒకసారి ప్రేమిస్తే మాత్రం విడిపోవడాన్ని తట్టుకోలేడు.

అతడిచ్చిన కవర్ ను జాకెట్లో దాచేసి రెండో ఫ్లోర్ లోకి వెళ్ళి 202 రూం తలుపు తట్టింది.

"లోపలికి రా జూలీ" అన్నాడు తలుపు తెరిచిన జావెద్. అతడు బెంగాలీ. ఇంజనీరింగ్ డిపార్ట్ మెంట్లో చేస్తాడు.

"సమయం లేదు జావేద్. నేను వెళ్ళాలి" అంది.

"సరే జస్ట్ పది నిముషాలు కాఫీ తాగి పోదువు రా. దేశం వెళితే మరలా ఎప్పుడొస్తావో ఏమో" అంటూ చేయి పట్టి లోనికి లాగాడు. ఇరవై నిముషాల తర్వాత అతడిచ్చిన కవర్ ను కూడా దాచుకుని బయటపడి వెనుదిరిగి అదే మెట్ల దారిన తన రూముకు వెళ్ళిపోయింది జూలీ.

ఉద్యోగులు నివసించే అకామిడేషన్ అది. కువైట్ లో అమ్మాయిలు అబ్బాయిలు కలుసుకోవడం నిషిద్ధం. అందుకే అలా చాటుగా కలవడం.

తరువాత రూములోకి వెళ్ళి ముందే సర్దుకున్న సూట్ కేస్ ను చేతబట్టుకుని కిందకి వచ్చింది. సెక్యూరిటీ గార్డ్ అలికిడికి లేచి "ఎవరు.. ఎవరు అక్కడ?" అని అరిచాడు.

"నేనే రహీం. జూలీని. మా నాన్నకు ఆరోగ్యం బాలేదు. ఎమర్జన్సీ సెలవు మీద ఇండోనేషియా వెళుతున్నాను" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

ఆ సమయంలో జూలీ ముఖం చూస్తే ఎంతటి కఠిన మనస్కుడైనా కరిగిపోవాల్సిందే.

"అయ్యో అలాగా.. హెచ్.ఆర్ పర్మిషన్ తీసుకున్నావా జూలీ..?"

"భలే వాడివే రహీం. పర్మిషన్ లేకపోతే ఎలా వెళ్ళగలను. టికట్ కూడా వాళ్ళే ఇచ్చారు. మా నాన్నకు ఆపరేషన్ చేయించి మరలా 15 రోజులకు వచ్చేస్తాను అంటూ దగ్గరికి వెళ్ళి చేయి పట్టుకుని ఒక వంద దినార్లు అప్పుగా ఇవ్వు రహీం. ఇక్కడికి రాగానే తిరిగి ఇచ్చేస్తాను" అర్థింపుగా అడిగింది.

వాడు జూలీ కన్నీళ్ళు తుడుస్తూ "ఇంతగా అడగాలా జూలీ. ఈ రహీం నీకు ఆప్త మిత్రుడు నీ కష్టం నాదే" అంటూ పర్స్ తీసి లెక్కపెట్టి వంద దినార్లు ఇచ్చాడు.

"కష్ట కాలంలో ఆదుకున్నావు. నీ మేలు మర్చిపోను. వస్తానే ఇచ్చేస్తాను. ఈ విషయం ఎవరికీ చెప్పకు" అంది బ్యాగుతో పాటూ బయటకు నడుస్తూ.

"సరే జాగ్రత్త" అంటూ నిద్రమత్తుతో ఆవలించాడు రహీం.

బయట ఆగివున్న టేక్సీ ఆమె కూర్చోగానే కువైట్ ఎయిర్పోర్ట్ కు పరుగు తీసింది. చెక్ ఇన్ అయి బోర్డింగ్ పాస్ తీసుకుని హమ్మయ్య అనుకుంటూ గేట్ వద్ద వున్న వెయిటింగ్ హాల్ లో కూర్చుని నవ్వుకుంది.

జూలీ రెండేళ్ళ క్రితం ఇండోనేషియా నుండి కువైట్ వచ్చింది. ఒక మనీ ఎక్చేంజ్ కంపెనీలో పనికి కుదిరింది. తెలివయింది కాబట్టి పని బాగా చేస్తుందనే పేరు తెచ్చుకుంది. ఆర్నెల్లు తిరిగేసరికి తనతో పాటూ పని చేసే విక్రంతో ప్రేమలో పడింది. అతను శ్రీలంక నుండి వచ్చి అక్కడ సూపర్వైజర్ గా పని చేస్తున్నాడు. మూడేళ్ళనుండీ అక్కడే పని చేస్తూ వున్నాడు కాబట్టి మంచి పొజిషన్ లో వున్నాడు. కంపెనీ అంతా అతని ఆధీనంలో వుంటుంది. జూలీకి కావల్సింది అదే. అతనితో చెట్టపట్టాలు వేసుకుని రెస్టారెంట్లు, బీచ్ లు తిరిగింది. జూలీనే తన లోకమనుకున్నాడు విక్రం. శ్రీలంకలోని అమ్మనాన్నలను వప్పించి ఆమెను పెళ్ళి చేసుకోవాలి అనుకున్నాడు. కానీ విక్రం కు తెలియనిది జూలీని చూసిన కొందరికి తెలిసిన విషయం వేరే వుంది. విక్రం తో పాటూ జావెద్, గుడ్డూ, ఇక్బాల్ అనే వాళ్ళతో కూడా జూలీ ఫ్రీగా తిరుగుతుందని.

అలా రెండేళ్ళు గడిచాయి.

రెండ్రోజుల క్రితం సడన్ గా "మా నాన్నకు ఆరోగ్యం బాలేదట విక్రం. ఆపరేషన్ చెయ్యాలట. నన్ను చూడాలని వుందని ఉన్న పళంగా బయలుదేరి అర్జంట్ గా రమ్మంటున్నాడు.

కడసారి అయినా నాన్నను ప్రాణంతో చూడాలి. ఆపరేషన్ కు చాలా ఖర్చు అవుతుందట. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు" అంటూ ఏడ్చింది. చలించిపోయాడు విక్రం.

"మీ నాన్నకు ఏమీ కాదు జూలీ. ఎంత ఖర్చు అయినా పరవాలేదు. మంచి డాక్టర్లకు చూపించు. నేనున్నాను కదా" అంటూ జూలీని ఓదార్చాడు.

"మా నాన్న కోసం నిన్ను విడిచి నేను వెళ్ళక తప్పదు విక్రం" బాధగా చెప్పింది జూలీ.

ఏం చెయ్యాలో తోచక మ్రాన్పడిపోయాడు విక్రం. ఎప్పుడో వెళుతుందని తెలుసు కానీ ఇంత సడన్ గా అనుకోలేదు. ఆమెతో గడిపిన సుఖాలు గుర్తొచ్చి మనసు బాధతో మూలిగింది. ఎంతగానో ప్రేమించిన ఆమె కోసం ఏదైనా చెయ్యాలి అనుకున్నాడు.అనుకున్నది చేసి కవర్ ను చేతికి అందించాడు.

కవర్ తీసి చూసి "ఇది అసలు సరిపోదు విక్రం" అంది ఆందోళనగా.

"మరెలా.. ఏం చేద్దాం జూలీ" అన్నాడు దిగులుగా.

"నువ్వు నిజంగా చేస్తానంటే ఒక ఐడియా వుంది. అలా చేస్తావా" అడిగింది ఎదపై వాలుతూ.

"అలాగే. నీ కోసం ఏమైనా చేస్తాను చెప్పు జూలీ" అన్నాడు విక్రం.

కష్టంలో ఆదుకోకపోతే ప్రియుడెలా అవుతాడు. మరో ఆలోచన లేకుండా వెళ్ళే ముందు మరొక కవర్ ను కూడా జూలీకి అందించాడు.

జూలీ ఫ్లయిట్ ఎక్కి వెళ్ళిపోయింది. పాపం విక్రం కు పిచ్చి పట్టినట్లు వుంది. ఏంజల్ లా కనపడే జూలీ ముఖం, అందమైన నవ్వు కళ్ళ ముందు మెదులుతున్నాయి. ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

జూలీ ఇప్పుడు జర్నీలో వుంటుంది కాబట్టి రేపు కాల్ చెయ్యాలి అనుకున్నాడు.

తెల్లవారుతూనే జకార్తాలో లాండ్ అయి వుంటుందని భావించి కాల్ చేసాడు. ఫోన్ రింగ్ అవుతుంది కానీ తీయలేదు. జూలీతో మాట్లాడక పోతే వుండలేని స్థితి అతనిది.

తరువాత వరసగా కాల్స్ చేస్తూనే వున్నాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ లో వుంది. పిచ్చెత్తింది విక్రం కి.

జూలీ కి ఏమీ కాలేదు కదా. క్షేమంగానే వుందా అనుకుంటూ వర్రీ అయ్యాడు. ఆఫీస్ కి వెళ్ళాడు కానీ పని అన్యమనస్కంగా చేస్తున్నాడు. ఇక వేరే ఏ ఆలోచన లేదు.  ప్రతి క్షణం జూలీ స్మరణే.

ఆ రోజు అలాగే గడిచింది.  అన్నం కూడా సరిగ్గా తినలేదు. జూలీ నుండి కాల్ గానీ మెసేజ్ కానీ లేదు. ఆమె ఫోన్ ఆఫ్ లో వుంది. ఏం చెయ్యాలో తోచలేదు. రాత్రంతా కాల్ చేస్తూ కూర్చున్నాడు. ఎర్రబడిన కళ్ళతో మరుసటి రోజు ఆఫీస్ కు వెళ్ళాడు.

అప్పటికే ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ నుండి ఆడిటర్స్ ఇద్దరు వచ్చి వున్నారు. వాళ్ళను చూడగానే కంగారు పడ్డాడు విక్రం. విక్రం సూపర్ వైజర్ కాబట్టి వున్న కలక్షన్, కేష్ చూపించి లెక్కలన్నీ తేల్చాలి.

లేకపోతే... భయంతో వణికాడు విక్రం. జూలీ కోసం ఆఫీస్ డబ్బు తీసుకున్న విషయం గుర్తొచ్చి తలచుకుంటేనే చెమటలు పట్టాయి విక్రంకి. తాళాలు తన చేతుల్లో వుంటాయి కాబట్టి శాలరీస్ రాగానే అది సర్దుబాటు చేద్దాం అనుకున్నాడు. కానీ ఆడిటర్స్ ఇంత తొందరగా వస్తారని ఊహించలేదు.

వెంటనే వెనుతిరిగి అక్కడి నుండి పారి పోవాలని పించింది. పోతే.. ఎక్కడికి పోగలడు. ఎంత దూరం పారిపోగలడు పోనీ తన అకౌంట్ నుండి తీద్దాం అనుకున్నా జీరో బ్యాలన్స్. అంతా ఊడ్చి జూలీకి ఇచ్చేసాడు. ఒక్క రూపాయి తేడా వచ్చినా వీళ్ళు ఒప్పుకోరు. అలా కుదరదు. దేవుడా ఏంటి పరిస్థితి. ఇప్పటికిప్పుడు అడ్జస్ట్ చెయ్యడానికి చిన్న మొత్తం కాదు. విక్రం తడబాటు చూసి వాళ్ళు "మిస్టర్ విక్రం ఏమయింది? అంతా ఓ కె కదా" అని అడిగారు.

గొంతు తడారిపోయింది. జవాబు చెప్పలేక మౌనంగా లెక్కలు చూపించాడు. కేష్ వెయ్యి దినార్లు తక్కువయింది. దానితో పాటూ జూలీ కేష్ ఫండ్ వంద దినార్లు కూడా తిరిగి ఇవ్వలేదు.

"విక్రం ఈ కేష్ ఏమయింది" ప్రశ్నించాడు ఫైనాన్స్ మేనేజర్.
నీళ్ళు నమిలాడు విక్రం. "అదీ.. కొంచెం అవసరమయి వాడాను సర్. శాలరీస్ రాగానే ఎవరినైనా అప్పు అడిగి సర్దుబాటు చేస్తాను" అన్నాడు లో గొంతుకతో.
"కంపెనీ మనీ వాడటం తప్పు కదా విక్రం" అన్నాడు ఫైనాన్స్ ఆడిటర్.
కేష్ విషయంలో ఆడిటర్స్ చాలా ఖచ్చితంగా వుంటారు. వుండాలి కూడా. వెంటనే మేనేజ్ మెంట్ కు తెలియజేసి విక్రంని ఒక గదిలో కూర్చో బెట్టారు. ఇంటరాగేషన్ మొదలు పెట్టారు.
"ఎందుకు చేసావ్..? ఎవరికిచ్చావ్..? ముందు కూడా ఇలాగే చేసావా..?" లాంటి ప్రశ్నలతో ప్రాణాన్ని విసిగించారు.
"ఇప్పుడు నిన్ను 3 రోజులు సస్పెండ్ చేస్తున్నాం. తరువాత పోలీసులకు అప్పగించాలా ఉద్యోగం నుండి తొలగించి మీ దేశానికి పంపాలా అనేది మేనేజ్ మెంట్ నిర్ణయిస్తుంది" చెప్పారు వాళ్ళు. అవమానంతో తల వంచుకున్నాడు విక్రం.
అక్కడ పనిచేసే వాళ్ళు వచ్చి "జూలీ కోసమే తీసావా అని అడుగుతూ జావేద్, గుడ్డూ, రహీం, విన్నీ వద్ద కూడా జూలీ డబ్బు తీసుకుందట. కాల్ చేస్తుంటే ఫోన్ స్విచ్ ఆఫ్ అట. అది వాళ్ళ నాన్నకు ఆరోగ్యం బాలేదని చెప్పి అందర్నీ మోసం చేసి పారిపోయింది.  ఎంత నయవంచన. ఎలా నమ్మావు దాన్ని. కేషియర్ ఫండ్ కూడా తీసుకుపోయిందట కదా! నీ డబ్బు ఇస్తే ఇచ్చావు కానీ ఆఫీస్ డబ్బు ఎందుకు ఇచ్చావు" అంటూ కొలీగ్స్ నిందిస్తుంటే విక్రం కు మతి పోయింది. 'నో నా జూలీ అలాంటిది కాదు' అని అరవాలనిపించింది.
ఇంతలో జూలీ నుండి ఒక మెసేజ్ వచ్చింది.
"సారీ విక్రం. నేను కువైట్ కు తిరిగి రావడం లేదు. డబ్బు కోసమే నేను నీతో ప్రేమను నటించాను. నీతోనే కాదు జావెద్, గుడ్డూతో కూడా. మా నాన్న పదేళ్ళ క్రితమే చనిపోయాడు. బాగా డబ్బు కావాలి అనుకున్నాను. నా కోరిక నెరవేరింది.  ఇక నన్ను మర్చిపో." అని వుంది ఆ మెసేజ్ లో. ఈ చేదు విషయాన్ని జీర్ణించుకోలేక పోయాడు విక్రం.

విక్రం ను సస్పెండ్ చేసి అతను ఎక్కడికీ పారిపోకుండా కాపలా వుంచారు. స్టాఫ్ అంతా జూలీ గురించి విక్రం దుస్థితిని గురించి గుసగుసలు చెప్పుకున్నారు. కొందరు నవ్వుకున్నారు. ఫ్రెండ్స్ బాధ పడ్డారు.
విక్రం సిగ్గుతో తలవంచుకుని రూముకు వెళ్ళిపోయాడు. చేసిన నేరానికి జైలుకో దోషిలా పాస్ పోర్ట్ లో ఎర్ర ముద్ర వేయించుకుని తమ దేశానికో వెళ్ళక తప్పదు.

ఇటు జూలీ దూరం అయింది.

ఆమె గురించి తెలిసిన నిజాలు ఆమె మోసం చేసిన తీరు తలచుకుంటే బ్రతకాలి అనిపించడం లేదు.

ఆ రాత్రి ఏమీ తినలేదు విక్రం. నిన్నటి వరకూ గౌరవంగా విష్ చేసే స్టాఫ్ హేళనగా నవ్వుకుంటున్నారు.

నిస్సత్తువగా బెడ్ పై పడుకుండి పోయాడు. జరిగిన అవమానంతో తలెత్తుకుని తిరగ గలడా?జైలు కెళ్ళి బతక గలడా.. తల విదిలించాడు.

కళ్ళు మూసుకుంటే అందమైన జూలీ ముఖమే గుర్తొస్తోంది. ప్రేమకు కాకుండా డబ్బుకు ప్రాధాన్యతను ఇచ్చింది జూలీ. అడిగితే ప్రాణం అయినా ఇచ్చేవాడు కదా. ఆ స్థితి, కలిగిన అవమానం మాటల్లో వివరించలేనిది. ఆ బాధ భరించలేనిది.

మరుసటి రోజు ఉదయాన్నే లేచి బిల్డింగ్ పైకి 16 వ అంతస్తులోకి వెళ్ళాడు.

ఒకసారి గుండె నిండా ఊపిరి పీల్చుకుని తల్లిదండ్రులను, తన దేశాన్ని తలచుకుని కిందకి దూకేసాడు విక్రం.

అతని ప్రాణం గాల్లో కలిసిపోయింది.

నాల్రోజుల తర్వాత అతని శరీరం భద్రంగా అతని దేశమైన శ్రీలంకను చేరుకుంది.

Post your comments